మిలటరీ స్పెషలు ఆచిన్నపట్నంలో ఆగింది ఆ సిపాయి దిగేందుకు. సిపాయి దిగేడు - అందరికీ వీడ్కోలు చెప్పేడు. అందరూ కేకలేసేరు.

"గుడ్‌బై! మళ్ళా ఎన్నాళ్ళకో! ఈసారి కాశ్మీరులో పడొచ్చు లడాయి!"

దిగేక, సిపాయి నాలుగు దిక్కులా తృప్తిగా చూసేడు.

పొగబండి అరిచి, టకటం చప్పుడు చేసుకుంటూ పోయింది. పెట్టెల కిటికీల గుండా, తలలు తొంగిచూసేయి - రుమాళ్ళతో చేతులు గాలిలో ఊగేయి.

పండు మీసాల ముసలి స్టేషన్‌మాష్టరు ఆఫీసులోకి పోయేడు. లోన టెలిఫోన్ గణ గణ. కుర్చీలాగిన చప్పుడు. టెలిగ్రాఫ్ డెమ్మీలు లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి.

'కిట్' భుజంమీద వేలవేసి బయటపడ్డాడు అతడు.

గేటు దగ్గరున్న రైల్వే ఉద్యోగి చిరునవ్వు నవ్వి అన్నాడు - "ఒచ్చేసేవా అప్పారావ్! అదృష్టవంతుడివి... బతికి బయటపడ్డావ్. ఎట్టాగున్నావయ్యా ఆ మంచులో!"

# హోమ్ కమింగ్

మంధా వెంకటరమణారావు

సిపాయి తనలో తాను నవ్వుకున్నాడు, తను ప్రేమించిన ఆడది, మరోడితో లేచిపోగా, ఆమెను క్షమిస్తూ, తనలో తాను నవ్వుకున్న హీరోలా. నవ్వులో చిన్న నిరసన భావం, కొద్దిగా విచారం.

కీచుమని శబ్దం. సిగ్నలు మీదికి పోయింది.

ఏదో మూల్గింది. ఒక గజ్జికుక్క, ఆఖరి దశలోని కుష్టువాడిలా.

రైలుకి పచ్చ జెండా చూపించేసేక, అప్పారావు అనబడే ఆ సిపాయి సగర్వంగా నవ్వి అన్నాడు. "బాగున్నారా సుబ్బారావ్! మన్ని చంపేవాడింకా పుట్టలేదయ్యా! పాతిక మందిని పిట్టల్ని కొట్టేసినట్టు కొట్టేసేనయ్యా. ఏంటనుకున్నావో అప్పారావంటే!"

బయట కొచ్చేక చుట్టూ కలియజూసేడు సిపాయి. దిబ్బయ్యరు టిన్ రేకు హోటలు అలానే ఉంది. దాని పక్కనే ఉన్న కంపు చెరువు బాగా

ఎండిపోయింది. అందువల్ల కంపు ఎక్కువయింది దోమలు అసంఖ్యాకం. అవి చెట్లలోనూ, సాంబారులోనూ, మసాలా పొడిలా కలుస్తూ ఉంటాయి. ఆ పక్కనే ఉంది కిరస్తానం వాళ్ళ శవాలుపాతే సిమిట్రీ గోరీలతో. గోరీలకి ఆ ఏడే వెల్లవేసేరు. అందుకని వెండి పొడుం కాయులలా ఎండలో తళ తళా మెరుస్తున్నాయి.

రోడ్డుమీద ఉండుండి లారీలచప్పుడు - పాత బెంజి' లారీలు జనపనార మోసుకుపోతున్నాయి, చిట్టిపలసజూటు మిల్లుకి. దూరాన్న ఏవో గొంతులు కలలోలా - కొళాయి దగ్గర నీళ్ళకోసం పని మనుష్యుల యుద్ధం అది - "వీళ్ళనే చైనావాళ్ళమీదికి యుద్ధానికి పంపుతే ఎంత బావుణ్ణు! తుపాకులు అవుసరం ఉండదు!" అనుకొని నవ్వుకున్నాడు సిపాయి.

అయినా అంతటా ప్రశాంతంగా ఉన్నట్టుంది. ఈ గోలంతా ఆ ప్రశాంతతలోని భాగాలే. - ఊరు నిద్రపోతున్నట్టే ఉంది. ఒకవేళ లేచినా, లేచి బద్ధకంగా ఆవలిస్తున్నట్టుంది. అక్కడ ఆ మంచులో అంతా నిశ్శబ్దంగా ఉన్నా, ఎక్కడ చీమ చిటుకుమన్నా' అగ్ని పర్వతం బద్దలైనట్టే ఉండేది. ఏదన్నా కదలిక, ఏదన్నా శబ్దం పసిగట్టడానికి బుద్ధి, మనస్సు పెద్ద యంత్రంలా పని చేసేవి.

అతని పాలిష్‌లేని మిలటరీ బూట్లు భూమిలోకి చొచ్చుకుని, చిన్న ఇసుక తుపాను లేవదీస్తున్నాయి. జోళ్ళతో నేలనికొట్టి, ధూళిరేపుతూ, రోడ్డుకొక ప్రక్కకు అతడు నడుస్తున్నాడు. ఉండుండి, లైలా మజ్నూలో ఘంటసాల పాడిన "ప్రియతమా" పాటకూని రాగం తీస్తున్నాడు.

స్టేషన్‌లో అతన్ని ప్రేమించిన కుష్టు కుక్కమాత్రం అతన్ని వదలలేదు. అతడి తోలు బూట్లమీదే దృష్టి నిలిపి వెంబడించింది. పాదాలకు దగ్గరగా, వెనుక పడుతూ, తిరిగి కలుసుకుంటూ - వెన్నెల రాత్రినాడు, ఆకాశంలో కనీ కనిపించనట్టు మెరిసే చుక్కల్లా, ఉండుండి మెరుస్తున్నాయి దాని కన్నులు, ఆఖరి దశలోనున్న జోళ్ళని చూసినప్పుడల్లా. ఒకసారి, దాని నాలుక మేజోడు చిరుగులవల్ల బయటకు కనిపిస్తున్నచోట కాలుని తాకింది. బూటుని రుచి చూడటంలో -

అతడు వెనుదిరిగి, కనురెప్పలు ముడిచి, అస్పష్టంగాతిట్టి నడక సాగించేడు -

మహాప్రస్థానంలో ధర్మరాజుని, కుక్క వెన్నంటినట్టు, శోకజాడించి ఆ కుక్క మరింత దగ్గరగా వెంబడించింది. ఆ ఆశాజనకమైన పాదాల్ని ఒక ఫర్లాంగు దూరం పోయేసరికి, లాలాజలంతో తడిపేయి మేజోళ్ళు.

చైనావాడే ఎదురుపడితే "ఎటాక్" చేసినట్టు సిపాయి, సుడిగాలిలా తిరిగి, కాలు పూర్తిగా వెనుకకులాగి, శక్తి అంతా ఉపయోగించి, కుక్కడొక్కలో



ఒక్క తాపు తన్నేడు. 'ఫుట్ బాల్' లా కొన్ని అడుగుల దూరాన ఎగిరిపడింది కుక్క. కెవ్వున ఒకఅరుపు, మూల్గు- అప్పుడు ఆరిపోయింది దాని గొంతు. దెబ్బ తగిలినచోట, రక్తం జేగురు ముద్దలా బయటకొచ్చింది.

దూరంగా, మరో జవ్వనితో మాట్లాడుతున్న ఒక ఎర్ర రవికప్రౌఢ,

సిపాయి ప్రతాపం కళ్ళారా చూసి, ఇలానే మనుష్యుల్నికూడా యుద్ధంలో చంపేడు కామోసు అనుకుంటూ, కిల కిలా నవ్వింది. "సోగ్గాడు, దయిర్యం, బలం అంతా కుక్కమీద సూపుతున్నాడే ...ఇలాటోళ్ళే యింటికాడ, ఆడదాని కొంగెనకాల నక్కి దాగుంటారు. అదొక్క తాపుతంతే కుయ్యో మొర్రో అంటారు. సిపాయి కోపంగా వెనుదిరిగి చూసేడు. కిల కిల నవ్వు విన్నాడేకాని, ఆ ఆడమనిషన్నమాటలు వినలేదు. మనసులో అనుకున్నాడు - "పొగరు బోతుముండ! ఎవడో చచ్చు వెధవ మొగుడై ఉంటాడు. నాలాటి వాడి చేతుల్లో పడితే ఈ కుక్కలాగే అరుచును ... బజారు ముండ నన్ను చూసి నవ్వుతుందీ!?"

అతడి 'మూడ్' పాడయిపోయింది. జోగుతూ, దీర్ఘంగా ఆలోచిస్తూ నడవ సాగేడు.

ఒక పాత 'ఫోర్డు' కారు, దాని వెనకే ఒక కొత్త 'అంబాసిడరు' కారు దాటిపోయేయి. ఫోర్డుకారులో ఉన్నాడు పేషెంట్ల రక్తంపీల్చే డాక్టరు. అతడు పేషెంటుని బతికిస్తాడు. కాని, కొన ఊపిరితో. బిల్లు చెల్లించే వరకూ ఆ ప్రాణం ఉంటుంది. ఏమందయినా వాడేస్తాడు. ఎలోపతీ, హోమియోపతీ, డిషేన్, ఆయుర్వేద, సమయానుకూలంగా. రెండు మేడలు కొన్నాడు. రెండు మూడు లక్షల వరకు ఇన్‌కంటాక్సు ఎగవేసేడు. కూతుళ్ళకీ, కొడుకులకీ డాక్టర్లనీ, డాక్టరమ్మల్నీ ఇచ్చి పెళ్ళి చేసేడు. నర్సింగ్ హోమ్ స్టార్టు చేసింది చిన్నకోడలు. అక్కడికొచ్చే పన్నీఅబార్షన్లు, ఆడరోగాలు. డబ్బున్న కేసులే. ఈ ముసలాడు కట్టిన నర్సింగ్ హోమ్‌లోని ఒకగోడకి మదుపు ఒచ్చి ఉంటుంది. నా తల్లికి కాన్సరనిచెప్పి వైద్యంచేసి, ఆఖరికి చచ్చేక ట్రీట్‌మెంట్ కనివసూలుచేసిన మూడువేలూ- అని కసిగా అనుకున్నాడు సిపాయి.

వెనుక అంబాసిడర్‌లో, సామాన్యంగానే అయినా, అందంగా అలంకరించుకొని వెళ్ళిపోతోంది ఆడప్లీడరు. ముప్ఫయి ఏళ్ళు పైబడ్డాయి- కాని పెళ్ళి కాలేదు. పెళ్ళిచేసుకోలేదు. ఇరవై ఏళ్ళ పడుచులా కనిపిస్తుంది ఆమె క్లయింటు కళ్ళకి. ఆమెకున్న క్లయింట్లు ఆమె ప్రేమికులే. ఆమెను ప్రేమించే వాళ్ళుకాదు, ఆమె ప్రేమించే వాళ్ళు. ఆమె హస్తగతమైన మగాడు, పీల్చేసిన చెరకు పిప్పిలా బయటపడతాడు. ఆమెకి బోలెడు ఆస్తి. తండ్రికి గారాబు కూతురు. తండ్రి వకీలుచేసి, ఇప్పుడుకూతురుక్లయింట్లని 'అటెండ్' అవుతున్నాడు. తండ్రీ కూతుళ్ళది అదొకరకమైన మానసిక సంబంధం. మరెవ్వరూ సంతతిలేక పోవడంవల్ల కొడుకుని పెంచినట్టు పెంచేడు. మగాడి మనస్తత్వమే అలవడింది ఆమెకి. ఆమె మాటే వేదవాక్కు. "నాకు పెళ్ళొద్దు నాన్నా"- "అలాగే నమ్మా!"- "నేను ఫలానా అతన్ని-

ప్రేమిస్తున్నాను నాన్నా!"- "మంచిదమ్మా....ఘాటుగా ప్రేమించు!" ఒకటి రెండు సార్లు ఈమె ముసలి డాక్టర్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళడం జరిగేక, ఆపరేషను చేయించుకుని, శాశ్వితంగా జాగ్రత్తపడింది. తరువాత ఆడపులిలా మదన రంగంలోకి ఉరికింది. సిపాయినవ్వుకున్నాడు తనకన్నా రెండేళ్ళు పెద్ద- కాని తనతోనే చదివింది. ఒకరోజు ఏవో నోట్సు రాసి పెట్టమని ఇంటికి పిలిచింది....స్కూల్ ఫైనలు పరీక్షలు దగ్గరపడుతున్నాయి. మేడమీది గదిలోకి తీసుకెళ్ళింది. "అమ్మాయికి సాయం చెయ్యి రా అప్పిగా!" అన్నాడు ముసలాడు. బాగానే సాయం చేసేడు....ఆడదంటే ఎంత భయంకరమైన మృగంగా మారగలదో, మొదటి పాఠం నేర్పింది ఆమె — సిగ్గూ, లజ్జా ఏమీ లేవు. అసహ్యం వేసింది.... బతికించింది.... తనని చూడలేదు! చూసినా బహుశా పోల్చుకోదు. ఇప్పుడంతా పెద్దపనులే. "దేవుడింత అందం, ఇలా దుర్వినియోగ పరిచేవాళ్ళకే ఇస్తూ ఉంటాడు" అని ఎవరో అన్నట్టు జ్ఞాపకం. ఒక్కొక్కప్పుడు అనుమానం ఒస్తుంది .... ఆడవాళ్ళంతా ఒకటేనా అని...సిపాయి ముఖం ఎర్రబడింది....గుండె కొట్టుకుంది .. తన భార్య .... ఒంటరిగా రెండేళ్ళయి....ఆ యింట్లో ప్రక్క యింట్లోనే .. తన చిన్ననాటి స్నేహితుడు అప్పలరాజు .... వాడో పెద్ద కిలాడీ .... ఈ ఆడ లాయర్‌కి చిల్లర పద్దు....కాలక్షేపం బతానీలా .... కాని తన భార్యకి తనంటే ఎంత ప్రేమ— ఎటువంటి ఉత్తరాలు రాసేది — కాని సంవత్సరమే సరిగ్గా దాని ఉత్తరాలే అందటంలేదు.రాయటంలేదేమో. వాడు కాని — అయి ఉండొచ్చు—ఆడదాన్ని ఎవడు నమ్మమన్నాడు — కాని తన వంటి మొగాడితో ఒకసారి కాపురం చేసేక, ఏ ఆడదన్నా మరోడి మొహం చూస్తుందీ? — చూడదు — చూస్తే— దాన్ని చంపి, కాకులకీ గెద్దలకీ వేస్తాడు — కీలుకి కీలూ ఊడదీసి -

ఈశ్వరుడి గుడిలో గంటలు మ్రోగుతున్నాయి. చేనులు ఇంకా పూజారిగా వున్నాడేమో. నాలుగేళ్ళ క్రితం గుండె పోటొచ్చి చచ్చిపోవాల్సింది. ముసలి డాక్టరు నయం చేసేడు. ఆనక ఫీసు చెల్లించుకుందుకి పెళ్ళాం మంగళసూత్రం అమ్మేసేడు. ఎప్పుడు వెళ్ళినా కొబ్బరి కాయ ముక్కలిచ్చేవాడు. చిన్నప్పట్నించీ-కూతురు, నల్లగా పీలగా ఉండేది. దాన్ని తనకిచ్చి పెళ్ళి చేద్దామని ఉండేదిట. కాని ఆ పిల్ల అకాలంగా మశూచికం ఒచ్చి చచ్చిపోయింది. చేనుల్ని ఒకసారి చూడాలి. కాని ఇపుడు కాదు. ఇప్పుడు వెళ్తే. ఏవో కబుర్లు ఆరంభించి మరి వదలడు.

వీధులన్నీ నీరసంగా వున్నాయే. దుకాణాలకి అట్టే బేరంలేదు. యుద్ధం ఒచ్చేక, ధరలన్నీ పెరిగిపోయి ఎవ

డికీ కొనే తాహతు లేకుండా పోయింది కామోసు.

"అప్పారావ్—కప్పలుదొంగ— బజారుకెత్తే మిరాయి దొంగ...."

అతడు విసురుగా తిరిగి చూసేడు. తన్ను సంబోధిస్తూ ఒక్కడూ లేడు. దూరంగా, స్కూలు పిల్లలు తమలో తాము అనుకుంటూ పోతున్నారు.

ఈరోజుల్లో, రోడ్డుమీద పోతున్న వాళ్ళమీద రాయివేస్తే, అది అప్పారావుకన్నా తగుల్తుంది, సుబ్బారావు కన్నా తగుల్తుంది.


వీధి దాటి సందులో పడ్డాడు.

ఏదో జువ్వలాటిది వచ్చి తలకు తగిలింది.

అది సగం కాల్చిన చుట్టపీక. కన్నులు ముడిచి, పెదవులు బిగపట్టి, తల త్రిప్పాడు. నాలుగు దిక్కులా. ప్రతి మేడమీదికీ దృష్టి సారించాడు. తను నిల్చున్న చోటే వుంది నగల వర్తకుడు నరసింహశెట్టి మేడ. నరసింహశెట్టి ఈ ఊరు రావడం బాగా జ్ఞాపకం ఉంది. పెద్ద రొజ్జ, నల్లటి విగ్రహం. ఒంటిమీద తుండుగుడ్డ,




S.446 FL




మాసిపోయిన పొట్టి పంచె. భార్య. నల్లగా పొట్టిగా ఉండేది. కాకి పిల్లలా చిన్న నల్లటి కొడుకు. శెట్టెమ్మ క్రితం రోజు రాత్రి చుప్పులు (చక్కిలాలు) చేగోడీలు, జంతికలు చేసేది. చేతిలో ఒక రింగుల చక్రంతో గల్లు గల్లుమని శబ్దం చేసుకుంటూ, ఊరల్లా తిరిగి అవి అమ్మేవాడు. ఉదయం ఇడ్లీ, ఉల్లిపచ్చడివేసి అమ్మేవాడు. మాసిన బట్టలు ఎప్పుడూ మార్చేవాడు కాదు. లక్ష్మి వెవరు ప్రేమిస్తారో వాళ్ళ దగ్గరే ఉంటుంది. అన్యులకి తనని ధారపోస్తే, వాళ్ళని నిరసిస్తుంది. క్రమేపీ, బంగారం నగలు తాకట్టుపెట్టి డబ్బు వడ్డీకిచ్చి, విటమిన్లిచ్చి, పేషెంటుని దుక్కతన్నింపించినట్టు, లక్ష్మిని పెంచి పెద్ద చేసేడు. అదలా బంగారు నగల వ్యాపారంలోకి మారింది. బంగారం ధర ఒక్కసారి పెరిగిపోయేసరికి, ఇంట్లో నిలవపున్న బంగారం కమ్ములు, కల్తీ బంగారు నగల క్రింద మారి, బంగారం కోసం ప్రాణాలన్నా ధారపోసే సుందరులని మరీ సుందరులుగా చేసి. నరసింహశెట్టిని లక్షాధికారిగా చేసేయి. నరసింహశెట్టి మంచి పసందైన ముండల్ని మేడమీదే ఉంచుకున్నాడు. కొడుకు, మరో మేడలో మరో ఇద్దరు స్త్రీ రత్నాలని తన కోసం ఉంచుకున్నాడు. వీళ్ళు అప్పుడప్పుడు మేడలు

మారడం కద్దు. ముండలూ, ముండలాధిపతీ, పై దేశపు పడవలు వచ్చినపుడు, వాళ్ళ దగ్గర సంపాదించిన విదేశీ సారాని, విశాఖపట్నం వెళ్ళినపుడు జాలర్ల దగ్గర కొనితెచ్చి, తాగుతారు, అయితే డబ్బు ఎలా ఒచ్చినది అలా ఎందుకు పోలేదు? ఎందుకు పోలేదంటే, ఒక మనిషి రెండుసందల పౌన్లు బలిసేక ఎంత సన్న పడదామని ప్రయత్నించినా, సన్నపడడం కష్టం. గాలి పీల్చినా బలమెక్కిపోతాడు. అలానే వ్యాపారమూనూ. ఈసాటి ఖర్చు, అందులో సాదరు క్రింద పోతుంది. "రాత్రల్లా తాగి తందనా లాడి, ఒళ్లు తెలీకుండా, ఇలా విసిరుంటాడు..." సిపాయి తిట్టుకున్నాడు.

మలుపు తిరుగుతూ ఉండగా కళ్ళు జిగేల్ మన్నాయి. గడ్డిమోపులు తలమీద పెట్టుకొని, యవ్వనంలో పిటపిటలాడుతున్న, వయసు పొంగుతో నల్లగా నిగనిగలాడుతున్న, అందమైన కళ్లతో లేళ్లలా ఉన్న, శ్రావ్యమైన కంఠంతో కిలకిల నవ్వుకుంటున్నా ఇద్దరు యువతులు! సిపాయి కళ్ళల్లోకి సూటిగా చూసి, కళ్ళతోనే నవ్వి, కన్నుకొట్టేరు. అతడు స్థంభించిపోయేడు. నోరు తెరుచుకొని ఉండిపోయేడు. "హారి దీని తల్లీసిగా.... ఈ ఊరు యింత అడ్వాన్సుడ్‌గా తయారైపోతుందని కలగన్నానా?" అనుకున్నాడు. నోరు వెళ్ల బుచ్చుకొని నిల్చున్న, ఆ సిపాయిని, పల్లెటూరి బైతుని చూసినట్టు చూసిపకపకా నవ్వుకున్నారుమగువలు. ఒకామె అడిగింది... "ఎక్కడెయ్యమంటావు గడ్డిమోపు, సిట్టిబాబూ! నీకైతే మోపు ఐదు రూపాయిలకే యేస్తా .... మరోడికైతే పది రూపాయిలే.."సిపాయికి వుషారు పుట్టుకొచ్చింది. "మీ అందరి కోసం యుద్ధం చేసి, చైనావాళ్ని చంపివచ్చేనే. లేకపోతే యములాళ్లలా' వాళ్లొచ్చి మిమ్మల్ని ఎగరేసుకు పోయుందురే. మోపు ఉత్తనే వెయ్యి..." అన్నాడు కన్నుగీటి. "నీకు కాబట్టి రూపాయి కేస్తా...ఒంతకు తగ్గదు.." అంది, రెండోది. ఇంతలో పోలీసు ఒకడు అటువేపు రావడం పసిగట్టి ఇద్దరూ తుర్రుమన్నారు.

సిపాయి తన మగతనానికి గర్వంగా నవ్వుకున్నాడు. దూరంగా నిల్చున్న మరో కుర్రాడు, తనలో తాను "ఫిలాసఫికల్" గా నవ్వుకున్నాడు. ఈ నాటకం గమనించినవాడై.

'ఊరు ఇంచుమించు ఆఖరయింది. ఆ తరవాతున్నది ఒక చెరువు. చెరువు గట్టుమీద ఎన్నో పూరిళ్లు, పెంకుటిళ్లు-ఆ వెనుకనున్నాయి వరి పొలాలు. దక్షిణపు గట్టుమీద, తక్కిన ఇళ్లతో సంబంధం లేకుండా ఉన్నాయి దగ్గరగా కలిసి రెండు పాత పెంకుటిళ్లు-బయలు ప్రదేశంలో ఉన్న అవి, చచ్చిపోతున్న

[అలవాటు లేకపోయినా
113 వ పేజీలో చూడక తప్పదు]

[ 96 వ పేజీ తరువాయి ]

నల్లటి ఏనుగులలా ఉన్నాయి. ఏనాడో ఎవరో కట్టించినవి. ఈ నాటికి అస్థిపంజరాల్లా మిగిలేయి. తన యిల్లు అది. తన తాతో, ముత్తాతో, మరెవడి తాతో ముత్తాత దగ్గరో కొన్నది. అది తనకి మిగిలింది. తన తండ్రి చిన్ననాడే పోయేడు. పెద్దయేక తల్లి పోయింది. ఆర్మీలో చేరే ముందే పెళ్ళి చేసుకున్నాడు, తల్లి బలవంతం మీద. పెళ్ళి చేసుకున్నాక, నౌకరీ దొరక్క, ఆర్మీలో ఎన్. సి. ఓ. గా చేరాడు. ఐదేళ్ళయి రావడం, పోవడం-యుద్ధం ఆరంభమయేక మరి రాకపోకలు లేవు. రెండేళ్ళయింది. ఆర్మీలోకి వెళ్ళిన మరుపేడే తల్లి, ముసలి డాక్టర్ దగ్గర ట్రీట్మెంటు పొంది చచ్చిపోయింది. ప్రక్క ఇంట్లో అద్దెకుంటున్నాడు అప్పలరాజు. స్కూల్లో తనకన్న రెండేళ్ళు వెక్కువ - వయస్సులో ఐదేళ్లు చిన్న-కాని అన్ని విధాలా తనకన్న పెద్ద జీవితానుభవంలో - ఇద్దరూ దగ్గర మిత్రులయ్యేరు .... పెళ్ళయి తను ఆర్మీకి పోవడానికి నిశ్చయించుకున్నాడు. అప్పలరాజు ఇన్సూరెన్సు ఏజెంటుగా, సిగరెట్ల ఏజెంటుగా ఏవో చిన్నచిన్న, వెల్లాళ్ళకూడా కాకుండా ముస్తు ఉద్యోగాలు చేస్తూ వుండిపోయేడు. పెళ్ళి చేసుకోడంట. అలా అని బ్రహ్మచారికాడు. ఆ సంగతి తనకి తెలుసు. అప్పలరాజు ప్రక్క వాటాలో ఉంటున్నాడు. అదే వాడి ఆఫీసు, ఇల్లు అన్నీ-వాడి తల్లీ, తండ్రీ పల్లెటూరులో భూములు చూసుకుంటున్నారు. వీడికి చిన్న పట్నం వదల బుద్ధికాలేదు.

అప్పలరాజు..ప్రాణస్నేహితుడు... తను లేనప్పుడు, తన భార్య బాగోగులు చూస్తానన్నాడు .... "చెల్లెమ్మ భారం నామీద వదిలీరా అప్పారావ్ ! ఏలోటూ లేకుండా చూస్తాను !" అన్నాడు. కాని తనకే కాస్త జంకువేసింది .... వీడి సంగతి తెలీందికాదు. సాని వీధిలో ఒకర్తె నుంచేడు. ఆడ లావుర్‌తో ఇప్పటికీ సంబంధ ముంది. ఇంకా ఎన్ని గ్రంధాలు నడిపేడో వాడికే తెలియాలి. వీడికి తల్లీ, చెల్లెల్లూ తప్ప ఆడదంటే అడదేనని అప్పారావు దృఢనమ్మకం. వీడికి అందమైన తన భార్యని, బాగోగులు చూడమని అప్పగించడం ఎలా? అప్పలరాజు అది గ్రహించకపోలేదు. వెంటనే అన్నాడు. "ఒరే అప్పారావ్ ! నా అంతిలో కూడా ఒక నియమం ఉంది. స్నేహితుల భార్యలనీ, అప్పచెల్లెళ్ళనీ చూస్తే నాకు సోదర భావం తప్ప మరేమీ ఉండదు .... నా తల్లిమీద ఒట్టు పెట్టి చెబుతున్నాను నమ్ము !" అన్నాడు. మరాడు మంచివాడే కావచ్చు....కాని ఒంటిగా ఉన్న ఆడదాన్ని నమ్మడం ఎలా? దానికి తిక్కపుడితే అప్పల

రా జా కా దు. వాడి కాకన్నా దిగి రావాల్సిందే....

అప్పలరాజు! .... ప్రాణ స్నేహితుడు కాడు! — ఆ ఉత్తరం ఎన్నో జాగాలు తిరిగి తిరిగి నలిగి, నలిగి నెలాఖ్ర్క్రితం అందింది. ఎవడో ఆకాశ రామన్న రాసేడు. తన భార్య శీలం మంచిది కాదుట. అప్పలరాజుతో అవే తిరగడాలు, షికార్లుట .... "ఇందుకే నీకు పిల్లలు లేరు— నలుగురూ నడిచే చోట గడ్డెలా మొలుస్తుంది?" అంతా ఏదో పిచ్చి రాతలన్నీ రాసేడు. ఎవడో కిట్టనివాడై యుంటాడు. కాని ఏమో? ఒంటరిగా ఉన్న ఆడ, మగలని ఎవరు నమ్మమన్నారు—

వంటరి ఇళ్ళని సమీపించేడు సిపాయి....యివాళ ఏదో ఒకటి తేలి పోతుంది. నిజమే అని రుజువై తే, యిద్దరి మృతదేహాలు రేపు ఉదయానికి చెరువు అడుగున పడిఉంటాయి. "ఎంతకి తెగించింది ముండ! మొగుడ్ని మోసంచేసి, రంకుమొగుడితో కల్సి ఆత్మహత్య చేసుకుంది. మొగుడొచ్చేడు, ఇంక గ్రంధం నడవదని?" అని అందరూ ముక్కుమీద వేలువేసుకొని, తనపట్ల పూర్తి సానుభూతి చూపిస్తారు. వాడిని భోజనానికి పిలిచి, మత్తుమందు ఇద్దరికీ షర్బత్తులో కలిపి యిచ్చి, ఊపిరి ఆపి, చంపి, యిద్దర్నీ కట్టి చెరువులో, అర్థరాత్రప్పుడు పడేవచ్చు. లేదా పెరట్లోని నూతిలో పడేయొచ్చు? తనుచంపేడంటే ఎవరూ నమ్మరు. అందరూ దద్దరిల్లేటట్టుగా తను ఏడవగలడు. యుద్ధంలో వీరుడి ని బిరుదు పొందిన తన సేవను అనుమానించగలరు? ఇంతకి—

ఇంటిముందు వెదురు దడి ఉంది. అది దాటి ఇంట్లోకి వెళ్తూ, ప్రక్క ఇంటిని సంబోధిస్తూ కేక పెట్టేడు సిపాయి— అంత గట్టిగా కాదు.... మామూలుగా....పిలిచినట్టూ ఉండాలి, పిలవక పోయినట్టూ వుండాలి. "అప్పలరాజూ! ఒరేయ్ అప్పలరాజూ!"


ఇంటి కిటికీలు కాని, తలుపులుకాని తెరుచుకోలేదు .... ఎందుకు తెరుచుకుంటాయి? ఇద్దరూ మాంచి నిద్రలో ఉండి ఉంటారు .... జాముపొద్దెక్కిందనన్నా మరిచిపోయి....అయితే ఉత్తరంలో రాసింది నిజమేఅయిఉంటుంది.

అతడి ముఖం ఎర్రబారింది, అవమానంతో, కోపంతో, కసితో.

ఆవరణలోని తోట పువ్వులతో కళకళ లాడుతోంది.

తన ఇంటి సావిడిలో, ఒకమూలకి పసుపుచుట్ట విసిరి, ఉస్సురుమంటూ చతికిలపడి, గోడకు చేరబడ్డాడు.

ఇంటి తలుపు వేసే ఉంది. రాకపోకలు అన్నీ పెరట్లోంచే అయినప్పుడు వీధి తలుపులు ఎందుకు తెరవడం! ఇంతకీ ఇది వాడి గదిలో ఉందా, వాడు దీని గదిలో ఉన్నాడా - బహుశా ఇదే అక్కడ ఉండి ఉంటుంది. ఉన్నట్టుండి లేచి, చప్పుడు చెయ్య




కుండా, తలుపు దగ్గరికి వెళ్ళి, చెవి తలుపుదగ్గర ఆన్చి, విన్నాడు శ్రద్ధగా.

లోపల నవ్వులు, కిలకిలలు, గుసగుసలూ ఏమీలేవు — ఐతే ఈ ముండ, వాడింట్లోనే ఉండి ఉండాలి. ఛీ! తన మగతనం మండిపట్టే ఉంది — ఒక ఆడది ఎన్ని ఆటలాడించ గలదు! నలుగురు విటులని మంచంకింద దాచి, మొగుడితో కూడా ఉందిట ఒక చతురురాలు ఒక పంచతంత్రం కథలో.

కోటుజేబులోనుండి సిగరెట్టు తీసి వెలిగించి ఒక దమ్ము లాగేడు.

అనుకోకుండా తలుపు తెరుచుకుంది.

ఉలికిపడి, కళ్ళు పైకెత్తాడతడు.

ఎదురుగా నిల్చుంది తన భార్య. విచ్చిన గులాబీలా తల వెండ్రుకలు విరబోసుకొని, ఒక రిబ్బనుతో ముడి వేసింది. లేతగులాబీ రంగు డిజైనున్న సరికొత్త వాయిల్ చీర రాత్రి కట్టుకోడం వల్ల నలిగి, ఆ చీరలో మరింత అందంగా కనపడేటట్లు చేస్తోంది. శ్వేత కెంపురంగు ఛాయలో, పెద్ద అమాయకమైన అందమైన కళ్ళతో, మగడిని పిచ్చెత్తించే అంత అందంగా అతడికి కనిపించింది. క్షణకాలం అతడికామె మీద ఎనలేని ప్రేమ పెల్లుబికింది-కాని వెంటనే అసూయపు జ్వాలలో అది దహించుక పోయింది.

అతడిని చూడగానే ఆశ్చర్యంతో క్షణకాలం మాటలు లేకుండా ఉండి పోయింది. మొదట గుర్తు పట్టలేదు. గుర్తు పట్టగానే ఆశ్చర్యం, ఆనందం ఆమె ముఖంలో ప్రతిబింబించాయి. ఉక్కిరి బిక్కిరిగా అరిచిందామె.

"మీరా !"

అతడిలో ఆగ్రహం బుసలు కొట్టింది "మీరా" అనిఅడుగుతోంది. నేను కాకపోతే మరెవరనుకుంది. ఆ యుద్ధంలో, ఆ మంచులో చస్తానను కుంది. చస్తేక రంకుమొగుడితో ఇంక పచ్చలవిడిగా కులుకుదామనుకుంది. వాడేం ఇంట్లోంచే, పెట్టిసన్నచ్చి, ఇంట్లో దూరిందా. లేకపోతే ఇంత అందంగా సింగారించుకొని, రాత్రి నిద్ర తియ్యాల్సిన అవసరం ఏముంది. తను ఇలా గాలిలోంచి పెత్యంలా ఊడిపడతాడను కోలేదు. ఎంత ఆనందంగా.

కోపం పెల్లుబకగా అరిచేడు — "ఔను ! నేనే ! ఏం, నేను రావడం నీ కిష్టంలేదా ? — ఎప్పుడూ అక్కడే ఉండి పోతాననుకున్నావా ?"

భయంతో ఆమె వెనుకకు తగ్గింది.

"ఒచ్చాక తలుపు కొట్టీ, కొట్టీ చేతులు పడిపోయాయి ! ఎక్కడ చస్తున్నావు ?" ఈ మాట అన్నాక, వెంటనే ఆలోచించుకున్నాడు. తను బయట పడిపోకూడదు. బయట పడి పోతే అసలు నిజం బైటపడదు —

"ఏమండీ, మీరు ఒస్తున్నట్టు ఒక్క ఉత్తరం ముక్కన్నా రాయలేక పోయారా ? స్టేషనుకి వచ్చిఉందును..."

"స్టేషనుకు వచ్చి ఉందువేం ! ఛీ... అబద్ధాలు !" ఉత్తరం రాస్తే స్టేషనుకి వచ్చి ఉండును. అప్పుడిలా పట్టుబడి పోడానికి అవకాశం ఉండదు. ప్రేమ ఒలకబోస్తూ తనని తియ్యగా మోసం చేసును —

ఆమె ఏమీ అర్థంకానట్టు బాధగా అంది — "ఏమిటండీ ఆ మాటలు — నా కెంత ఆనందంగా ఉందో మీరు రావడం —"

"నోర్మూయ్ !"

పరుపుచుట్ట ఎత్తి గదిలోకి విసిరేడు.

పిచ్చివాడిని ఆశ్చర్యంగా చూసినట్టు చూసిందామె.


"ఇక్కడి నిలువుటద్దం ఏదీ ?" అని బొబ్బలు పెట్టేడు —

తత్తరపాటులో అంది — "క్రిందటి సారి అమ్మ ఒచ్చినప్పుడు ఇచ్చేను.. చెల్లి మారాం చేస్తోందట. కాలేజీలో చేరింది కదా ?..అన్నీ మీకు రాసేనే.. ఉత్తరాలు నావేవీ మీ కందలేదా ?"

ఇది ఏ ఉత్తరాలూ రాయలేదు.... ఈనిలువుటద్దం ప్రక్కవాడిపడకగదిలో ఉంటుంది ..సరే... చూద్దాం.

"అమ్మకిచ్చేవా ?...ఎవడిమ్మన్నాడు?"

"ఏమండీ ఇలా మారిపోయేరు ?... ఏమయింది మీకు ?... మీరు తిరిగి




వచ్చేవరకూ ప్రాణాలు పిడికిట్లో పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నాను ... వెంకటేశ్వరుడికి ముడుపు కట్టుకున్నాను..."

రంకు నేర్చింది బొంక నేరుస్తుంది. ఎన్ని నీతులైనా చెప్తుంది.

"నోర్ముయ్యి !"

చిన్న గొంతుతో అన్నదామె. "అలిసిపోయేరు. స్నానం చెయ్యండి. కాఫీ చేసి తెస్తాను."

అతడు అరిచేడు..."ఒద్దు...నాకేమీ ఒద్దు ఈ ఇంట్లో...అక్కడికి పోయి, ఆకొండల్లో, ఆమంచులో గుళ్ళదెబ్బలు తింటూ బతుకుతామో చస్తామో ఏ క్షణానికేదో తెలియక రోజులు గడుపుతాం....నువ్విక్కడ, నీఇష్టమొచ్చినట్టు జల్సా చేస్తూ...."

"ఏవండీ!" ఆమె కేక పెట్టింది.

అతడు తగ్గేడు .... ఆమె అతడిని వెనక నుండి సమీపించి, పెనవేసుకొని, ప్రేమగా అంది. "ఎందుకు నా మీద ఇంత కోపం ?"

మోచేత్తో నెట్టేసాడామెని. బాధతో మూల్గిందామె.

"నోర్ముయ్యి !" ఆ మాటలంటూ టేబిలు మీద పుస్తకాలు తణికీ చేసేడు. డ్రాయరు సొరుగు తెరిచి కాగితాలు చూడసాగేడు .... అందులో అతడికి కనిపించింది అప్పలరాజు ఫోటో.... ఉలికిపడి, కోపాన్ని అణచుకొని అన్నాడు....

"అప్పలరాజు ఫోటో కదూ ?", కనురెప్పలెత్తి కన్నగిటి, ఎప్పుడూలేని శాంతాన్ని అలవరచుకొని ప్రశ్నించాడు.

దగ్గరిగా వెళ్ళి పిరికిగా ఆ బొమ్మను చూస్తూ అన్నదామె ...

"ఔను."

"ఇచ్చేదా ?"

"మీకొక్కటే ఉంచేరక్కరద .... గుర్తు లేదా ?"

ఉరిమినట్టుఅన్నాడు. "నో మ్మియ్యీ! అబద్ధాలు! అబద్ధాలు! ...ఎప్పుడ్నించి మరిగేవు డివి! ఎంత మోసం చేసేవ్ నన్ను! ఉత్తరం ఒస్తే ఎవడో కిట్టని వెధవ రాసేడనుకొన్నాను. అందుకే పే పెట్టి పిచ్చివా ఊతిపడడు! మిత్ర ద్రోహి....నమ్మక ద్రోహి మీఇద్దర్నీ ముక్కలు ముక్కలుగా నరుకుతాను." అతడి ప్లానంతా మారిపోయింది. చెయ్యదలచుకున్న పని అనేసేడు ... దీన్ని మన్నా తెలివిగా మార్చాలి. కాని కోపం, ఆవేశం, ఆలోచనలని అను కున్నట్లు సాగనివ్వడం లేదు. తన అనుమానం అబద్ధం అవుతుందను కున్నాడు. కాని అది నిజమవ్వడంతో, ఎవరో తన పురుషత్వాన్ని వెన్నులో పొడిచినట్లయింది. ఛీ... వెధవబతుకు ...అతడిలో నిజీవం పోయినట్టయింది. శక్తి ఇంకిపోయింది. నైరాశ్యం ఆవ హించింది.

నమ్మలేనట్టు అతడిని చూసి. కళ్ళు చేతులతో కప్పుకొని ఏడుస్తూ అందామె...."మీకు నా ఉత్తరాలే అంద లేదా? అప్పలరాజు ఏనాడయ్యో చచ్చి పోయేడు.... ఎమర్జన్సీలో ఆ ర్మీలో చేరేడు. నేఫాకి వేసేరు. ఏమయ్యేడో తెలీదట. చచ్చిపోయేడని టెలిగ్రాం వచ్చింది. అప్పలరాజు మీదా మీ అను మానం! నన్ను నిజంగా చెల్లెలి మాదిరిగా చూసేడు. ఎంత జాలి లేకుండా తయారయ్యేరు!..."

స్థంబీ భూతుడయ్యేడు అతడు. అప్పలరాజు యుద్ధంలోచేరి, నేఫాలో కనిపించకుండా పోయేడా? చచ్చి పోయేడా? రక్తాన్ని కరడు కట్టించే ఆ మంచులో, అప్పలరాజు ప్రాణం లేని దేహం, ఆ హిమాలయాలకే అంకితం అయిపోయిందా? లేదా, దారి తప్పి మంచులో సజీవ సమాధి పొందేడేమో. ఎక్కడున్నాడో... ఏమయిపోయేడో...

అప్పలరాజూ! అతడి మనసు ఏడ్చింది. ఆ మంచు ప్రాంతంలోకి వెళ్ళి గాలించింది. మరింకెక్కడి అప్పలరాజు. తప్పిపోయిన, చచ్చి పోయిన, వేలకొలది సిపాయిల్లో ఒక డయిపోయేడు.

దుఃఖం ఒక్క క్షణమే.

ఆ క్షణం గడిచిపోయేక, ఎందుకో మనస్సు తేలిక పడింది. సంతోష రేఖలు ముఖంలోకి తిరిగి వచ్చేయి. పోయిన పురుషత్వం తిరిగి వచ్చినట్ట యింది.

శాంతంగా, తాపీగా, సిగరెట్టుతీసి ముట్టించి, తోటలో విరుస్తున్న ఒక ఎర్ర గులాబీని చూస్తూ అన్నాడతడు చల్లగా. "కాఫీచేసి పట్రా! ఓహ్! అలిసిపోయేను. వెధవ ప్రయాణం!"

కాని ఆమె కదలలేదు.

ఏడుస్తూనే వుంది. వెక్కి వెక్కి.... అవమానభారంతో... ఏమీ చెయ్యలేని కోపంతో ...!

***